బ్రోచర్ ఆవిష్కరించిన కిషన్ రెడ్డి



రాజేంద్రనగర్: భారతదేశంలోని అన్ని రాష్ట్రాల ఐటీ సెక్టార్‌కి సంబంధించిన యువతీ, యువకులు ఒక్కటిగా జట్టు ఏర్పడి సంతోష్, ప్రశాంతి ఆధ్వర్యంలో శ్రీ రామచంద్రస్వామి ప్రతిష్ఠించిన జ్యోతిర్లింగం రామేశ్వరం నుంచి దాదాపు 150 మంది గత 5 రోజుల క్రితం యాత్ర ప్రారంభించారు. ఈ యాత్రకు మంగళవారం శివరాంపల్లిలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి స్వాగతం పలికారు. ఈ యాత్ర అన్ని రాష్ట్రాల మీదుగా ఫిబ్రవరి 14వ తేదీన అయోధ్య చేరుకొని శ్రీ రామచంద్రస్వామి దర్శనం చేసుకుంటారు. ఈ ఐటీ సెక్టార్ సోషల్ మీడియాకు సంబంధించిన యువకులు భారతదేశం రామరాజ్యం కావాలని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటూ ఈ యాత్ర ప్రారంభించారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ... యువకులు ధృఢ సంకల్పంతో ఈ యాత్రను ప్రారంభించారో మోదీ సంకల్పించినటువంటి వికాసిత్ భారత్ 2047 వరకు భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవాలని.. దానికి యువకులంతా నడుం బిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, నారగూడెం మల్లారెడ్డి, బొక్క బాల్‌రెడ్డి, వై. శ్రీధర్, కొమురయ్య, పి. మల్లేష్ యాదవ్, జె. రవి, జె. ఆనంద్ రెడ్డి, సత్యనారాయణ ముదిరాజ్, జయానంద రెడ్డి, పాల్గొన్నారు.

ప్రారంభమైన సొడమ్మ గుట్ట జాతర




జాతరలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రాజేంద్రనగర్ డివిజన్ సొడమ్మ గుట్టపై నిర్వహించే జాతర ప్రారంభమైంది. ప్రతి సంవత్సరం సంక్రాంతి రోజు నుంచి మూడు రోజుల పాటు ఈ జాతర కొనసాగుతుంది. నగరం నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఈ దేవాలయానికి తరలి వస్తుంటారు. అమ్మవారికి బోనాలు, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. జాతర సందర్భంగా దేవాలయం భక్తులతో కిటకిటలాడుతుంది. దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో పాటు వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. నగరం నలుమూలల నుంచి వచ్చిన యువకులు పెద్ద ఎత్తున గాలిపటాలను ఎగరవేశారు. మంగళవారం నిర్వహించిన పూజ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా నాయకుడు డి. సత్యనారాయణ ముదిరాజ్ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం కమిటీ సభ్యులు సత్యనారాయణకు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



శివసాయిక్షేత్రంలోని కాశీవిశ్వేశ్వరస్వామి





అన్నపూర్ణాదేవి

రాయదుర్గం: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో భోగి, మకర సంక్రాంతి, కనుమ పండగ సందర్భంగా అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కాశీవిశ్వేశ్వరస్వామి, అన్నపూర్ణాదేవి, గణపతి, షిర్డీ సాయిబాబా, ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి, రాయదుర్గంలోని వెంకటేశ్వర స్వామి, లక్ష్మీనర్సింహస్వామి, ఆంజనేయస్వామి, ఊరపోచమ్మ, నానక్‌రాంగూడ, గోపన్‌పల్లిలోని రంగనాథస్వామి ఆలయాల్లో, ఆంజనేయస్వామి ఆలయం, గౌలిదొడ్డిలోని శివాలయం, సాయిఐశ్వర్య కాలనీలో అమ్మవారికి, శివుడికి, కొత్తగూడ, కొండాపూర్, ఇందిరానగర్, ఎన్టీఆర్‌కాలనీ, గోపన్‌పల్లితండాలోని ఆలయాల్లో పూజలు చేశారు.

విద్యా విధానంలో మార్పులు వస్తున్నాయి

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఓరియంటేషన్, సెన్సిటైజేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని మాలవీయ మిషన్ టీచర్స్ ట్రైనింగ్ సెంటర్ (ఎంఎంటీటీసీ) ఆధ్వర్యంలో ఎన్ఈపీ–2020పై ఫ్యాకల్టీ ప్రతినిధులకు మరింత అవగాహన కల్పించేందుకు ఆన్‌లైన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని వారం పాటు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా నూతన జాతీయ విద్యావిధానంలో విద్యా సంస్కరణలు, సమాచార, కమ్యూనికేషన్ టెక్నాలజీ వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యూజీసీ–ఎంఎంటీటీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్‌ఫాతిమా మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా విధానంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, గూగుల్ యుగంలో కూడా ప్రతి ఒక్కరికి సమూల మార్పులపై అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాబోధనలో కూడా నూతన మార్పులకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఓరియంటేషన్ కార్యక్రమం జనవరి 25వ తేదీ వరకు కొనసాగుతుంది. కార్యక్రమంలో పలువురు 'మనూ' అధికారులు, యూజీసీ– ఎంఎంటీటీసీ అధికారులు, దేశ వ్యాప్తంగా 130 మంది పైగా పాల్గొన్నారు.

ఉచిత ఆరోగ్య కేంద్రం

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నాదెళ్ళ లక్ష్మయ్య మెమోరియల్ ఆరోగ్యం కేంద్రంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. అవుట్ పేషెంట్ రూ.30లు చెల్లించాలి. ప్రతి రోజు సుమారు 25 మంది రోగులకు వైద్య పరీక్షలు చేస్తారు.

అయోధ్య రామాలయ నిర్మాణం అపూర్వ ఘట్టం

గోల్కొండ: అయోధ్యలో శ్రీ రామాలయ నిర్మాణం దేశ చరిత్రలోనే ఓ అపూర్వ ఘట్టమని బీజేపీ కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి. అమర్‌సింగ్ అన్నారు. అమర్‌సింగ్ జన్మదినం సందర్భంగా మంగళవారం ఆయనను గుడిమల్కాపూర్‌లో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22న ప్రతి హిందువు దీపావళి జరుపుకోవాలని తమ ఇళ్లను, ఇంటి పరిసరాలను దీపాలతో అలంకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జి.సునీల్ యాదవ్ ఉన్నారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిలో స్వచ్ఛ భారత్‌తో పాటు పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మజహరుల్లా అన్నారు. మంగళవారం ఆసుపత్రిలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఆసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే కౌసర్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆసుపత్రిలో పెయింటింగ్ పనులతో పాటు ఇతర పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని ఆయన అన్నారు.

సంబరంగా సంక్రాంతి వేడుకలు



నార్సింగిలో గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేసిన కుటుంబాలు



మంచిరేవులలో గాలిపటాలను ఎగురవేయడానికి సిద్ధంగా ఉన్న దృశ్యం

మణికొండ: సంబరాలను తెచ్చే సంక్రాంతి పండగను అత్యధికులు స్వస్థలాలో జరుపుకునేందుకు వెల్లగా మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలలో ఉండే స్థానికులు మూడు రోజుల పండగను సంబరంగా జరుపుకున్నారు. సోమవారం సంక్రాంతి పండగను పురస్కరించుకుని మహిళలు గృహాల ముందు రంగు రంగుల ముగ్గులు వేశారు. వాకిళ్లలో గొబ్బెమ్మలను ఉంచి వాటి మధ్య కుండలను పెట్టి పాలు పొంగించారు. అనంతరం పూజలు నిర్వహించి ఇష్ట దేవతలను మొక్కుకున్నారు. భోగి పండగ నుంచి మొదలుకుని మంగళవారం వరకు నార్సింగి, ఖానాపూర్, మంచిరేవుల, నెక్నాంపూర్, వట్టినాగులపల్లి, గండిపేట్, కోకాపేట, పుప్పాలగూడ, మణికొండలలో పెద్ద ఎత్తున గాలిపటాలను ఎగరవేసి సందడి చేశారు. హైదరాబాద్ నగరం నుంచి వచ్చిన వారు గోల్డన్‌మైల్, ఖానాపూర్ గ్రామాలలో పెద్ద ఎత్తున గాలిపటాలను ఎగరవేశారు.

ఆనందోత్సాహాల మధ్య సంక్రాంతి సంబరాలు

రాజేంద్రనగర్: డివిజన్‌లో సంక్రాంతి పండుగను ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. సోమవారం ఉదయం మహిళలు తమ ఇళ్ల ముందు సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ వివిధ రంగులతో అందమైన ముగ్గులు వేశారు. ముగ్గుల మధ్యలో గొబ్బెమ్మలను పెట్టి మహిళలు, యువతులు, చిన్నారులు ఫోటోలు దిగుతూ సందడిగా కనిపించారు. గంగిరెద్దులు తీసుకొచ్చిన వారితో పాటు హరిదాసులకు దానం చేశారు. యువకులు సోమ, మంగళవారం పెద్ద ఎత్తున పతంగులను ఎగరవేస్తూ ఆనందంగా గడిపారు. పండుగా సందర్భంగా వివిధ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ పండుగను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు.



పతంగులు ఎగురవేస్తున్న యువకులు

సంక్రాంతి ముగ్గులతో అయోధ్య రామాలయం



ప్రశాంత్‌నగర్ కాలనీలో అయోధ్య ముగ్గు వేసిన వెల్లంకి సంతోషి సత్య

బండ్లగూడ: సంక్రాంతి అనగానే గుర్తుకొచ్చేది మహిళలు వేసే రంగురంగుల ముగ్గులు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఒక మహిళ తన ఇంటి ముంగిట అయోధ్య రామాలయ నమూనా ముగ్గు వేసి ప్రత్యేకతను చాటింది. దేశ వ్యాప్తంగా ఎవరుని కదిలించినా ఎవరి నోట విన్నా ఈ నెల 22న జరిగే అయోధ్య రామమందిరం గురించే వినిపిస్తుంది. ఎవరికి వారు ఆ రాముడిని తలచుకుంటూ తమతమ పద్ధతిలో భక్తిని చాటుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే బండ్లగూడ జాగీరు ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన ఏల్లంకి సంతోషి సత్య తన ఇంటి ముందు మూడున్నర గంటల పాటు శ్రమించి ఏకంగా అయోధ్యలో నిర్మించిన రామాలయాన్ని ముగ్గు వేసి రామమందిరంపై తనకున్న భక్తిని చాటుకున్న ఆ మహిళా మూర్తిని పలు కాలనీ వాసులు అభినందిస్తూ ఆసక్తిగా తిలకించారు. కాలనీకి చెందిన సంఘ సేవకురాలు సంధ్య గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి ఈ ముగ్గును అందజేస్తానని తెలిపారు.

ఆలయ ప్రారంభం స్వాగతిస్తూ..

ఈ నెల 22న అయోధ్య శ్రీ రాముడి ఆలయ ప్రారంభోత్సవాన్ని స్వాగతిస్తూ ఈ ముగ్గు వేశాను. 21 రోజుల పాటు దీక్ష చేపట్టాను. శ్రీరాముడు అయోధ్య అక్షింతలు మా ప్రశాంత్‌నగర్ కాలనీలోని వినాయక టెంపుల్ నుంచి బండ్లగూడ జాగీరులోని ప్రతి ఇంటింటికి పంపిణీ చేశాం. ఆ తర్వాత అయోధ్యలోని రామమందిరం సందర్శించి ఆ రాముడి ఆశీర్వాదం తీసుకున్నారు.

–వెల్లంకి సంతోషి సత్య ప్రశాంత్‌నగర్ కాలనీ

పార్కు చేసిన వాహనానికి నిప్పు పెట్టిన గుర్తు తెలియని వ్యక్తులు



అత్తాపూర్: పార్కు చేసిన వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం తెల్లవారుజామున సంఘటన చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం... సులేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ మక్దూం ఈ నెల 14వ తేదీన రాత్రి రోజు మాదిరిగానే తన ద్విచక్ర వాహనాన్ని (టీఎస్07ఏ77841) ఇంటి ముందు పార్కు చేశాడు. దీంతో 15వ తేదీన తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. ఇదే యాక్టివా వాహన్నా ఇటీవలే తగలబెట్టేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎన్ఈపీ-2020పై మరింత అవగాహన అవసరం



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: నూతన జాతీయ విద్యావిధానం –2020పై అవగాహన అవసరమని మనూ వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్(ఎస్ఈఅండ్‌టీ), ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(ఐటీఈపీ) ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ఎన్ఈపీ–2020లోని మార్గదర్శకాలను వివరించారు. ఐటీఈపీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ చంద్‌కిరణ్‌సలూజా మాట్లాడుతూ పిల్లల సామర్థ్యాన్ని గమనించడం, అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఈ అండ్ టీ డీన్ ప్రొ. వనజ రచించిన పుస్తకాలను ఈ సందర్భంగా వీసీ ఐనుల్ హసన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 'మనూ'రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇష్తియాక్ అహ్మద్, ఎస్ఈ అండ్ టీ విభాగం అధిపతి ప్రొఫెసర్ షాహీన్ అల్తాఫ్‌షేక్ ప్రసంగించారు. కాగా ఎన్‌సీటీఈ బృందం ఉర్దూ విశ్వవిద్యాలయంలో పర్యటించారు. బృందం సభ్యులు మదన్ యాదవ్, పూజా శర్మ, అనిల్‌కుమార్, అభిమన్యుయాదవ్, దినేష్ చతుర్వేది, ఫ్యాకల్టీ సభ్యులు యూనివర్శిటీ క్యాంపస్‌ను సందర్శించారు. అనంతరం క్యాంపస్‌లో మొక్కలు నాటారు.

రైల్వే సమాచారం

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ నుంచి దూర ప్రాంతాలకు బయలుదేరు రైళ్ల వివరాలు..

- 4.40 అమరావతి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి – విజయవాడ
- 6.15 జన్మభూమి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి –వైజాగ్
- 12.25 దేవగిరి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి– సీఎస్ఎంటీ (ముంబాయి)
- 18.25 నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి–తిరుపతి
- 18.30 కోకనాడ ఎక్స్‌ప్రెస్ లింగంపల్లి– కాకినాడ (సోమ, బుధ, శుక్ర) (19.00 మంగళ, గురు, శని)
- 20.30 గౌతమి ఎక్స్‌ప్రెస్‌లింగంపల్లి– కాకినాడ
- 21.05 నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లింగంపల్లి– నర్సాపూర్
- 21.40 హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌లింగంపల్లి–ఇండోర్ (ఆదివారం)



శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్: కళాకారులు నృత్యప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబురాలలో భాగంగా మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గంగిరెద్దుల ఆటలు, హరిదాసులు, బుడబుక్కలు, జంగమ దేవరలు , పిట్టలదొర, కొమ్మదాసరుల ఆటలు, పాటలు సందర్శకులను అలరించాయి. బెంగుళూరుకు చెందిన భరతనాట్య కళాకారులు సుప్రియ కొమండూరు శిష్య బృందం, సంతోష్‌కుమార్ తమాంగ్ శిష్యబృందం, ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శనలో తోడయ మంగళం, హనుమాన్ చాలీసా, నటేశకౌతం, తిల్లాన, శివస్తుతి, శబ్దం తదితర అంశాలతో అలరించారు. కలకత్తాకి చెందిన కూచిపూడి కళాకారులు బిరాజ్ రాయ్ బృందం , పూణేకి చెందిన అంజలిరాజు శిష్యబృందం పాండురంగ విఠల్ పాటలకు నృత్యం చేశారు.





'మనూ' దూరవిద్య ఫలితాలు విడుదల

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో దూర విద్యా కోర్సుల ఫలితాలను విడుదల చేశారు. సెప్టెంబర్/అక్టోబర్–2023 నెలలో నిర్వహించిన ఓడీఎల్ కోర్సుల ఫలితాలను ప్రకటించారు. దూర విద్యాకోర్సులలో ఎం.ఏ. బీఎస్సీ, బీకామ్, డిప్లమో ఇన్ జర్నలిజమ్ అండ్ మాస్ కమ్యూనికేషన్, డిప్లమో ఇన్ టీచ్ ఇంగ్లిష్ వంటి కోర్సుల ఫలితాలను ప్రకటించారు. యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో చూడాలని అధికారులు సూచించారు.

కిరాణా దుకాణంలో అగ్నిప్రమాదం

- రూ.30 లక్షల ఆస్తినష్టం



గచ్చిబౌలి: షార్ట్ సర్క్యూట్‌తో కిరాణా దుకాణం దగ్ధమైన సంఘటన రాయదుర్గంలో చోటు చేసుకుంది. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపిన వివరాలు.. మంగళవారం తెల్లవారుజామున రాయదుర్గంలో జైభవాని హోల్‌సేల్ కిరాణ దుకాణంను నీరుడి కిరణ్‌కుమార్ నిర్వహిస్తున్నాడు. తెల్లవారుజామున ఫ్యూజు బాక్సు వద్ద షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగి దుకాణంలో ఉన్న వస్తువులు బూడిదయ్యాయి. రూ.30 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు తెలిసింది. సకాలంలో అగ్నిమాపక కేంద్రం వారు వచ్చి మంటలార్పే ప్రయత్నం చేసినప్పటికీ మొత్తం కాలిపోయాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

'గుర్తింపు కోసం ఇంకెన్నాళ్లు వేచి చూడాలి'



కార్పొరేటర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: పార్టీని నమ్ముకోని కష్టపడి పని చేసే వారికి తగిన గుర్తింపు, పదవులు అందించి ప్రొత్సహించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు నమ్మిన బంటుగా, ప్రధాన అనుచరుడిగా ఉంటూ ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే గెలుపు కోసం రేయింబవల్లు కష్టపడ్డామన్నారు. మాకు సరైన గుర్తింపు రావడం లేదని పేర్కొన్నారు. గతంలో ఎంపీపీగా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, మేయర్‌గా ఎంపిక చేసే అవకాశం వచ్చినా నాకు అన్యాయం చేశారని ఆవేధన వ్యక్తం చేశారు. ఓ గ్రామానికి సర్పంచ్‌గా ఉన్న మమ్ములను ఎంపిటిసిగా, వారు కార్పొరేటర్‌గా మార్చి రాజకీయంగా డిమోషన్ చేశారని వాపోయారు. న్యాయంగా నాకే ఈ మేయర్ పీఠం దక్కాలని, కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల కొల్పోయానని, ఇప్పుడు చట్ట ప్రకారం కలిసి వచ్చిన అవకాశంను జారవిడుకోదల్చకోలేదన్నారు. బల నిరూపణలో అవిశ్వాసంను నెగ్గించుకోని మేయర్ పీఠంను దక్కించుకోని తీరుతామని లతాప్రేమ్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు.

ఘనంగా ఈదమ్మ అమ్మవారికి బోనాలు



ఈదమ్మ అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే రజకుల కుల దైవమైన ఈదమ్మ అమ్మవారికి బోనాలు, తొట్టెల ఊరేగింపు, డప్పు చప్పుళ్లతో భారీ ఎత్తున నాలుగు గ్రామాల ప్రజలు అత్తాపూర్, హైదర్‌గూడ, ఉప్పర్‌పల్లి, నందిముస్లాయిగూడ రజకులు అందరూ పాల్గొన్నారు. పెద్ద తాళ్లకుంట ధోభీ ఘాట్ 164 పిల్లర్ నంబర్ వద్ద ప్రెసిడెంట్ కొండమీది నర్సింగ్ రావు, కార్యదర్శి ఎర్రోళ్ల సుధాకర్, కోశాధికారి ఎర్రోళ్ల మహేశ్, ఉపాధ్యక్షులు ఎర్రోళ్ల అశోక్, ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎర్రోళ్ల కిరణ్ కుమార్, ఇచ్చాపురం పుష్పమ్మ, ఎర్రోళ్ల శివశంకర్, కొండమీది లింగయ్య, కమిటీ మెంబర్లు అందరూ ఈదమ్మ అమ్మవారికి బోనాలను ఘనంగా సమర్పించారు.

ఆర్థిక పరిస్థితులతో మహిళ ఆత్మహత్య



రీనా బేగం మృతదేహం

అత్తాపూర్: కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఓ గృహిణీ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం... రాజేంద్రనగర్ సులేమాన్‌నగర్ ప్రాంతానికి చెందిన రీనా బేగం (26), షేక్ అబ్దుల్లాలు దంపతులు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు సంతానం ఉన్నారు. షేక్ అబ్దుల్లా ఫర్నీచర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా గత కొన్నేళ్లుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతుండటంతో రెండేళ్ల నుంచి రీనా బేగం తల్లిగారింట్లోనే ఉంటుంది. కాగా ఇటీవలే రీనా బేగం తిరిగి అత్తాగారింటికి వచ్చింది. ఇంట్లో నెలకొన్న ఆర్థిక పరిస్థితులకు తోడు మద్యం సేవించిన భర్త అబ్దుల్లాతో ఇంట్లో మరోసారి గొడవ జరగడంతో తీవ్ర మనస్థాపానికి గురైన రీనా బేగం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టాటా ఏస్ ఇంజిన్‌లో పొగలు



వాహనం ఇంజిన్ నుంచి వెలువడుతున్న పొగ

రాజేంద్రనగర్: ఖాళీ అట్టల లోడ్‌తో వెళుతున్న ఓ టాటా ఏస్ వాహనం ఇంజన్ నుంచి మంగళవారం పొగలు రావడంతో ఆరాంఘర్ ప్రాంతంలో తోటి వాహనదారులు గమనించి వాహనాన్ని పక్కకు ఆపారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఇంజిన్ వేడెక్కడంతో పొగలు వచ్చాయని డ్రైవర్ వెల్లడించారు. మహబూబ్‌నగర్ నుంచి ఖాళీ అట్టలను టాటా ఏస్ వాహనంలో తీసుకొస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. ప్రధాన రహదారిపై ఈ సంఘటన జరగడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. వెంటనే స్పందించిన ట్రాఫిక్ పోలీసులు వాహనాన్ని పక్కకు తప్పించి క్రమబద్ధీకరించారు.

హెచ్‌సీయూలో జాయింట్ టీచింగ్ ప్రోగ్రాం ప్రారంభం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అంతర్జాతీయ జాయింట్ టీచింగ్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని యునెస్కో చైర్ ఇన్ వల్నరబిలిటీ స్టడీస్ ఆధ్వర్యంలో క్వీన్స్ యూనివర్శిటీ బెలాఫాస్ట్ (క్యూయూబీ)లోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ సహకారంతో హెచ్‌సీయూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ హెచ్‌సీయూ ఆధ్వర్యంలో ఏకైక ఉమ్మడి బోధనా కార్యక్రమంగా దీన్ని అభివర్ణించారు. హెచ్‌సీయూ యునెస్కో చైర్ ఇన్ వల్నరబిలిటీ స్టడీస్ ప్రొఫెసర్లు ప్రమోద్ కే నాయక్, అన్నా కురియన్ పాత్ర ఎంతో ఉందని, భవిష్యత్తు లో కూడా ఇలాంటి పాత్రలను పోషించాలని సూచించారు. భారతీయ, ఐరిష్ విద్యార్థులందరూ కలిసి పనిచేయడం వల్ల నిజమైన విద్యా అనుభవం కలుగుతుందన్నారు.

చైనా మాంజాను నిషేధించడంలో అధికారులు విఫలం

నాంపల్లి: నిషేధిత చైనా మాంజాను వ్యాపారస్తులు అడ్డగోలుగా విక్రయిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు పూర్తిగా అడ్డుకోలేకపోయారని సామాజికవేత్త కె.ఎల్.శ్రీనివాస్ రావు ఆరోపించారు. చైనా మాంజా వ్యాపారుల అరాచకాలకు ఒక ఆర్మీ అధికారి మృతి చెందడం బాధాకరమని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చైనా మాంజాను పూర్తిస్థాయిలో నిషేధించి ఉంటే ఆర్మీ అధికారి ప్రాణాలతో బయటపడేవారని పేర్కొన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడే అధికారులు స్పందించి మూకుమ్మడిగా కేసులు బనాయిస్తున్నారే తప్పా మాంజాను నిషేధించాలనే చిత్తశుద్ధి లేకుండా పోయిందన్నారు.

22న అయోధ్యరాముడి పూజలు

జియాగూడ: ఈనెల 22న జియాగూడ డబుల్‌బెడ్‌రూమ్ అంబేడ్కర్ భవన్‌లో అయోధ్యరాముడి పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సనాతన హిందూ ఆలయాల పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర చైర్మన్ పి.యాదగిరి ముదిరాజ్, అధ్యక్షుడు యమన్‌సింగ్, కోశాధికారి సీహెచ్. కాశిబుగ్గ బాబన్న అన్నారు. మంగళవారం జియాగూడలో బీఆర్ఎస్ కార్వాన్ అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు మంగి కిశోర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.... మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల మధ్య ప్రధాని మోదీ చేతుల మీదుగా అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠాపన జరుగుతోంది. ఈ సందర్భంగా సనాతన హిందూ ఆలయాల పరిరక్షణ సమితి ద్వారా జియాగూడ డబుల్‌బెడ్‌రూమ్‌లో అయోధ్య రాముడి పూజలు, మహా అన్నదాన కార్యక్రమం, భజన, ఊరేగింపు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.